మద్యం.. ప్రాణాలతో చెలగాటం

- ఏలూరులో రోజంతా విక్రయాలు
- మద్యం షాపులో ఇటీవల వ్యక్తి మృతి
- తీవ్రగాయాలతో మరో వ్యక్తి ఆసుపత్రిపాలు



ఏలూరు ఎస్‌ఆర్ వైన్స్‌లో మద్యం తాగుతూ మృతి చెందిన మేక అనిల్ (ఫైల్), వంగాయగూడెం మద్యం దుకాణం సమీపంలో రోడ్డుపై పడిపోవటంతో తీవ్ర గాయాలైన వ్యక్తి (ఇన్‌సెట్‌లో)

ఏలూరు టౌన్: కూటమి సర్కారు 24/7 మద్యం విక్రయిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు నగరంలో ఇటీవల ఒక వ్యక్తి ప్రైవేటు మద్యం షాపులో తాగుతూనే మృతి చెందాడు. తాజాగా మరో వ్యక్తి నడవలేనంతగా మద్యం తాగి రోడ్డుపై పడిపోవటంతో తలకు తీవ్ర గాయమైంది. అతను అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తెలిసింది. ఇలా జనం మద్యం మత్తులో జోగుతూ, సర్కారును నిలదీయకుండా, కూటమి సర్కారు మత్తులో ముంచేస్తోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

మద్యం తాగుతూ..

ఏలూరు నగరంలోని విజయవిహార్ సెంటర్ నుంచి ఎల్‌ఐసీ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో ఎస్‌ఆర్ వైన్స్‌లో 10 రోజుల క్రితం ఒక వ్యక్తి చీప్ లిక్కర్ (రాయల్ లాన్సర్ విస్కీ క్వార్టర్ బాటిల్) మద్యం తాగుతూ, అక్కడే పడి మృతిచెందాడు. ఆ వ్యక్తి చింతలపూడి ప్రాంతానికి చెందిన మేక అనిల్‌గా పోలీస్, ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.

అపస్మారక స్థితిలోకి..

ఏలూరు వంగాయగూడెం సెంటర్ ప్రాంతంలోని ప్రైవేటు మద్యం దుకాణంలో పూటుగా నడవలేని స్థితిలో మద్యం తాగిన ఒక వ్యక్తి మద్యం షాపు సమీపంలో సిమెంట్ రాయిపై పడిపోవటంతో తలకు తీవ్ర గాయమైంది. అతడిని స్థానికుల సమాచారంతో పోలీసులు ఏలూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అతను అదే ప్రాంతానికి చెందిన సుబ్బారావు (40)గా గుర్తించారు. ప్రస్తుతం అపస్మారక స్థితిలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇలా ప్రతినిత్యం ఎంతో మంది వ్యక్తులు మద్యం మత్తులో జీవితాలను చిత్తు చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించగా, ఎప్పుడు బడితే అప్పుడు మద్యం దొరికేది కాదు. పైగా మద్యం షాపుల వద్ద మందు తాగే అవకాశం లేకపోవటం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే పోలీసులు కేసులు నమోదు చేయటంతో భయంతో మద్యం తాగటం తగ్గించారని అని చెప్పుకుంటున్నారు. కానీ నేడు కూటమి పాలనలో ఇష్టారాజ్యంగా మద్యం సిండికేట్ విక్రయాలు చేస్తూ జేబులు నింపుకుంటుందనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యం



మద్యాన్ని ఏరులై పారిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు మద్యం షాపులను నిర్వహిస్తూ ఉండడంతో లాభాల కోసం, జేబులు నింపుకునేందుకు విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. ప్రజలు మద్యానికి బానిసలుగా మారుతూ.. మత్తులో ప్రాణాలు కోల్పోవటం, ప్రమాదాల బారిన పడడం జరుగుతుంది. వారిపై ఆధారపడిన కుటుంబాలు మాత్రం రోడ్డున పడుతున్నాయి. నాణ్యమైన మద్యం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు ఏం చేస్తుందో ప్రజలంతా గమనిస్తున్నారు.

– యశ్వంత్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

మద్యంపై సందేహాలు



కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాలపై ప్రజల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎటు చూసినా నకిలీ మద్యం కేసులు నమోదు అవుతున్నాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతంలోనూ నకిలీ మద్యం విక్రయాలపై అరెస్టులు చేశారు. ప్రజల జీవితాలను నాశనం చేస్తూ, కూటమి నేతలు, మద్యం సిండికేట్ వ్యాపారులు మద్యం అమ్ముతూ జేబులు నింపుకుంటే.. సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవటం బాధాకరం. నాణ్యమైన మద్యం హామీలు ఏమయ్యాయి.

– బి.మధుకుమార్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

బాణసంచా సరుకు స్వాధీనం



గాంధీనగర్‌లో బాణసంచా తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: అనధికారికంగా బాణసంచా సామగ్రి నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. ఏలూరు గాంధీనగర్ ప్రాంతంలో సీఐ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై లక్ష్మీనారాయణ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. విమలాదేవి నగరపాలక పాఠశాల సమీపంలోని ఒక ఇంట్లో భారీగా నిల్వ చేసిన బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకుని, పోలుపల్లి కనకరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా నిత్యం తనిఖీ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఘనంగా తొలి వైద్యుడి జయంతి

ఏలూరు (టూటౌన్): తొలి వైద్యుడు, నాయీ బ్రాహ్మణ కులదైవం ధన్వంతరి జయంతిని సాహితీవేత్త డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం, ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు శుభలేఖ కల్యాణ మండపంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట రాజు, బడేటి చంటి, జెడ్పీ చైర్‌పర్సన్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డప్పల నాయుడు, మేయర్ నూర్జహాన్ తదితరులు మాట్లాడారు. వైద్య రంగం, న్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని సన్మానించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఏలూరు(మెట్రో): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మానవత, జిల్లా పరిషత్ ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ మన ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణను విద్యార్థులు, ఉద్యోగులు, వాలంటీర్లు పరిశుభ్రపరిచారు. జెడ్పీ సీఈఓ ఎం శ్రీహరి, గంటా ప్రసాద్, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, మానవత ఏలూరు యూనిట్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బరోడా బ్యాంకు వద్ద అగ్నిప్రమాదం

ఏలూరు టౌన్: స్థానిక అమీనాపేటలో బ్యాంక్ ఆఫ్ బరోడాలో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. బరోడా బ్యాంకు వద్ద బయట ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా దట్టమైన పొగలు రావటంతో స్థానికులు ఏలూరు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం లేదని, విద్యుత్ మీటర్‌లో ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు వచ్చాయని సహాయ అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని ఒక ప్రైవేటు మద్యం దుకాణంలో పూటుగా మద్యం సేవించటంతో ఒక వ్యక్తి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగాయగూడెం ప్రాంతానికి చెందిన వీరవల్లి సుబ్బారావు మద్యానికి బానిసగా మారాడు. అతని ప్రవర్తనతో అతని భార్య విసుగుచెంది పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో శనివారం మద్యం అధికంగా తాగి వంగాయగూడెం రోడ్డు పక్కన పడిపోవటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతున్నాడు.

నిపుణ - మెప్మా ఆధ్వర్యంలో 5న జాబ్ మేళా



మెప్మా కార్యకలాపాలపై సమీక్షిస్తున్న తేజ్ భరత్

ఏలూరు(మెట్రో): నిపుణ - మెప్మా ఆధ్వర్యంలో నవంబర్ 5న నిర్వహించే జాబ్ మేళాకు ఏలూరు జిల్లాలోని ప్రతి మునిసిపాలిటీ పరిధిలో మెప్మా విభాగం నిరుద్యోగులు నమోదు చేసుకోవాలని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ అన్నారు. ప్రస్తుతం మెప్మా ద్వారా అమలవుతోన్న కార్యక్రమాలపై ఆయన స్థానిక గోదావరి కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. మెప్మా కార్యక్రమాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, మహిళల సామర్థ్యాన్ని పెంచే దిశగా మహిళా వికాశం అనే డిజిటల్ యాప్‌పై మెప్మా మహిళలందరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మునిసిపాలిటీలో తృప్తి క్యాంటీన్, అరకు కాఫీ ఫ్రాంచైజీ వంటివి మెప్మా మహిళల ద్వారా ఏర్పాటు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వరరావు, ఎస్ఎంఎం ఎల్‌హెచ్ శ్రీనివాస్, ఎన్ఆర్ఆర్ రంగాచారి, మెప్మా పిడిలు పి.మాధవి, జి.హెప్సిబా, రెండు జిల్లాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం



ఇఫ్టూ రాష్ట్ర తరగతులపై ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ప్రజా సమస్యల పరిష్కారానికి, కార్మిక హక్కుల పరిరక్షణకు ఐఎఫ్‌టీయూ నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం జిల్లా కోశాధికారి ఎం నాగరాజు అన్నారు. నవంబర్ 1, 2, 3, 4 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ప్రచారం నిమిత్తం ప్రజల వద్ద నుంచి విరాళాలు సేకరించే కార్యక్రమంలో భాగంగా శనివారం విజయ విహార్ సెంటర్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, నాయకులు రమణ, అప్పారావు, గంగరాజు, వెంకటేశ్వరరావు, శ్రీను, దుర్గారావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన త్రయోదశి పూజలు



ధ్వజ స్తంభం వద్ద పూజ చేస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ధన త్రయోదశి సందర్భంగా శనివారం స్థానిక కొత్తపేట కళ్యాణ వేంకటేశ్వర స్వామి, జానకీరామ, గౌరీ శంకర, సాయి మందిరానికి భక్తులు పోటెత్తారు. మహిళా భక్తులు ఆలయ ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రకాశాచార్యులు భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. స్వామివారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

హౌసింగ్ డే లక్ష్యాలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

దెందులూరు: గృహ లబ్ధిదారులకు ప్రయోజనాన్ని చేకూర్చేందుకు సమష్టి కృషి చేయాలని ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. శనివారం చాటపర్రులో నిర్మాణ ప్రదేశంలో హౌసింగ్ డే సమావేశం నిర్వహించారు. సమావేశ లక్ష్యాన్ని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మొక్కల పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్థానిక 20 వ డివిజన్ నరసింహారావుపేటలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర సభలో స్థానిక ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ వాయు కాలుష్యం నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాలుష్యం వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల గురించి వివరించారు. మేయర్ షేక్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ప్రాతినిధ్యం లభించే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న దేగా ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేసి వెనుకబడిన వర్గాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లభించే వరకు పోరాటాలు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. బీసీ కుల గణన చేయాలని కోరుతూ స్థానిక స్ఫూర్తి భవనంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ 144 బీసీ కులాలు ఉండగా కొన్ని కులాలు మాత్రమే రాజకీయంగా అభివృద్ధి చెందడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్రంలో బీసీలు 50 శాతం వరకు ఉన్నారని, శాస్త్రీయంగా కుల గణన చేస్తే వెనుకబడి ఉన్న వర్గాల శాతం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మన్నవ కృష్ణ చైతన్య, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకులు లక్కోజు గోపి మాట్లాడుతూ కుల గణన సమగ్రంగా, శాస్త్రీయంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు, బీసీ నాయకులు కన్నబాబు, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్, న్యాయవాది పీపీ, శాస్త్రి, ఎంసీపీఐ యు నాయకులు సానంపూడి నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వీరకి పండు తదితరులు మాట్లాడారు. తొలుత సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు స్వాగతం పలుకగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్ వందన సమర్పణ చేశారు. సమావేశంలో సీపీఐ, మహిళా సమాఖ్య, ఏఐటీయూసీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, చేతి వృత్తిదారులు సంఘం, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉప్పులూరు హేమ శంకర్, కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇంగిర, వరక శ్యామల, కొండేటి బేబి, పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, భజంత్రీ శ్రీనివాసరావు, పాటేలు పెంటయ్య, డి.శివకుమార్, బళ్ల కనకదుర్గారావు, గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వరరావు,బేతా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ న్యూ విక్టోరిస్ ఎస్‌యూవీ విడుదల



విక్టోరిస్ ఎస్‌యూవీ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మారుతి సుజుకి ఆథరైజ్డ్ డీలర్ రెడ్డి అండ్ రెడ్డి మోటార్స్‌లో ఆల్ న్యూ విక్టోరిస్ ఎస్‌యూవీని వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ శ్రీరామ్ రెడ్డి, లోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్‌యూవీ విక్టోరిస్ ప్రారంభ ధర రూ.10.49 లక్షలతో మొదలవుతుందని, కొత్త బెంచ్ మార్కులను సెట్ చేయడానికి రూపొందించిన వాహనమిదని తెలిపారు. డిజైన్, థ్రిల్లింగ్ పనితీరును గల ఎస్‌యూవీ పర్యావరణ అనుకూలమైన సీఎన్‌జీలో కూడా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో మారుతి ప్రతినిధులు నారాయణ్ సింగ్, కపిల్ గుప్త, జనరల్ మేనేజర్ ఫణీంద్ర కుమార్, వినియోగదారులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

ఏలూరు (టూటౌన్): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ, జాతీయ కోఆర్డినేటర్, మాజీ డీజీపీ డాక్టర్ బి.పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. స్థానిక ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను నొక్కివేసే విధంగా, అణచి వేసే విధంగా దాడులు నిర్వహిస్తోందని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గుర్తుచేస్తూ రాబోయే రోజుల్లో ప్రజల తరపున పోరాడుతామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సమావేశంలో ఏఐబీఎస్‌పీ రాష్ట్ర సలహాదారుడు ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, జిల్లా అధ్యక్షులు ములకాలు సత్యనారాయణ, జిల్లా సెక్రెటరీ మర్రి కిరణ్, జిల్లా కార్యదర్శి మన్నేపల్లి వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి

ఏలూరు (టూటౌన్): యాదవులంతా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మిడి చింతయ్య పిలుపునిచ్చారు. సంఘం స్థానిక జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గంతో పాటు, జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు నూతన కమిటీలను ప్రకటించారు. ఈ సందర్భగా చింతయ్య, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, ఏలూరు ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ మాట్లాడారు. నాయకులు కాట్రు బాలు, బీకేఎం నాని, డొక్కు వెంకటేశ్వరరావు, ఇప్పిలి వెంకటేశ్వరరావు, మల్లిపూడి రాజు, మెరుగుమాల శ్రీనివాసరావు, నున్న లక్ష్మణరావు, పిల్లల శ్రీనివాస్, గోల లోకేశ్వరరావు, జమలయ్య, యువరాజు పాల్గొన్నారు.

శ్రీవారి పుష్పాలకు బంగారం సమర్పణ



బంగారం సమర్పిస్తున్న భక్తురాలు జ్యోతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి నిత్య పూజల కోసం 108 బంగారు పుష్పాల నిమిత్తం భక్తులు బంగారం సమర్పించుకుంటున్నారు. శనివారం ఏలూరుకు చెందిన భక్తురాలు కె.జ్యోతి రూ. 52 వేల విలువైన 3.190 గ్రాముల బంగారాన్ని ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పాలడుగు వెంకట రమాదేవికి అందజేశారు. ట్రస్ట్‌బోర్డు సభ్యుడు ఈతకోట శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళం ప్రకటించారు. తొలుత ఆలయ ట్రస్ట్ బోర్డు తొలి సమావేశం చైర్మన్ రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. వచ్చే కార్తీక మాసం, ధనుర్మాస పూజలు, డిసెంబర్ నెలలో ప్రతి ఏటా నిర్వహించే స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల నిర్వహణపై చర్చించారు. సమావేశంలో ఆలయ ముఖ్య అర్చకుడు కిలాంబి బారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్ కుమార్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆటో మొబైల్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని ది ఏలూరు కార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షుడు ఉప్పులూరి హేమ శంకర్ కోరారు. ఆర్‌ఆర్‌పేట స్ఫూర్తి భవన్‌లో శనివారం నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో హేమశంకర్ మాట్లాడారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన మాగంటి నాగభూషణం అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి అర్హులకు పూర్తిస్థాయిలో స్థల కేటాయింపులు చేయకపోవడం వల్లే ఆటోనగర్ భూములను ఏపీఐఐసీ వారు రిజంప్షన్ చేశారని తెలిపారు. తద్వారా ఆటోనగర్‌లో సొంత షెడ్లు నిర్మించుకున్న వారికి ఆటోనగర్ అభివృద్ధి జరగక, రోడ్లు, డ్రెయిన్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. యూనియన్ సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి వెంకటపతి మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఆటోమొబైల్ వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 23వ తేదీ గురువారం సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆటోనగర్ అధ్యక్షుడు అరుణతార నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి స్థలాల కేటాయింపునకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు మహబూబ్ షరీఫ్, కోశాధికారి కాటూరి శ్రీధర్, యూనియన్ కమిటీ సభ్యులు పొన్న ధర్మరాజు, గ్రంధి నాగరవి కిషోర్, పాలకొండ శ్యాంప్రసాద్, అబ్దుల్ లక్ష్మణ్, బొడ్డు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	38	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	48
బీరకాయలు	28	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	32